# నవ్వే పెదవుల వెనక ఏడ్చే కళ్ళు




మధురాంతకం రాజారాం

డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్‌గా నేను తాళ్ళచెరువులో అడుగుపెట్టేనాటికి, నాకా ప్రాంతమూ క్రొత్తే. ఉద్యోగమూ క్రొత్తే. ఊరికి చివర మనుషులంతా నడయాడని చోట. ఒక పెంకుటింటిలో ఏర్పాటు చేయబడిన కార్యాలయంలో కిటికీ దగర కూర్చుని పచ్చికమైదానంవైపు చూస్తూ కాలం గడిపేవాణ్ణి. గుమాస్తా వెంకటేశం ఏవో కాగితాలు తీసుకొచ్చి సంతకాలు పెట్టించుకునేవాడు. ప్రతిరోజూ టపాలో ఒక బుట్టెడు ఉత్తరాలు, బుక్ పోస్టులు వస్తుండేవి. వాటిని చూచినప్పుడల్లా నా అజమాయిషీ క్రింద దాదాపు వంద ప్రాథమిక పాఠశాలలు పనిచేస్తున్నాయన్న విషయం గుర్తుకొస్తుండేది. మ్యాపు దగ్గరుంచుకుని ఆ పాఠశాలల ఉనికి గుర్తుపట్టడానికి నాకు పదిహేను రోజులు పట్టింది. అయినా ప్రయాణ వసుపాయాలను గురించి నాకు తెలిసింది చాలా తక్కువ. రోడ్డుపైన బస్సు దిగి ఒక్కొక్కప్పుడు అయిదారు మైళ్ళు గూడా నడవవలసి వచ్చేది. గుట్టలు, మిట్టలు దాటి తోటలగుండా పొలాలగుండా దొంకదార్లో పడి ఎంతో దూరం నడచిన తర్వాత ఒకపల్లె, ఒక దారీ ఒక తెన్నూ లేకుండా చెల్లాచెదరగా కొన్ని యిండ్లు. అందులో ఒకబడి. ఈ బడి కట్టడం ఒక పూరిపాక గావచ్చు. ఒక పాతగుడి గావచ్చు. సత్రపు అరుగు గావచ్చు. ఒక్కొక్కప్పుడు భగవంతుడు ప్రసాదించిన చెట్టునీడే గావచ్చు పంతులుగారు కూర్చోడానికొక కుర్చీ అయినా లేని పాఠశాలలుండేవి. అయినా అయ్యవారికి కావలసింది కుర్చీ కాదుగా : నెలజీతం. తల్లిదండ్రులకు యింట్లో పిల్లల పోరు లేకుంటేచాలు తెల్లవారగానే చద్దన్నాలు పెట్టి వాళ్ళను బడికి తోలేస్తారు. అయ్యవారు గొర్రెల కాపరిలాగా ఆ పిల్లలకు కాపుంది వేళ కాగానే బడి వదలేస్తారు. వాళ్ళు చదువుకొంటున్నదీ లేనిదీ ఎవరు గమనిస్తారు ?— అందుకోసమే నేను నియమింపబడివున్నాదన్న విషయం జ్ఞప్తికి వచ్చినప్పుడల్లా నాకు ఏడుపొస్తుండేది. ఈ కుర్రవాళ్ళకు నిజంగా చదువు రావడానికి తగిన అనుకూల పరిస్థితులను గురించి ప్రభుత్వమూ ఆలోచించడంలేదు. తల్లిదండ్రులూ పట్టించుకోడం లేదు.

ఉద్యోగంలో చేరిన క్రొత్తలో నేను హోటలునుంచి భోజనం తెప్పించుకుంటూ, ఒంటరిగా ఒక చిన్న గదిలో వుండేవాణ్ణి. బ్రతుకు స్తబ్ధమై పోతున్నట్టు తోస్తే, ప్యూను పాపయ్యనుపిలిచి ఏదైనా బడి తనిఖీకి వెళ్దామనేవాణ్ణి. గుడిబండ, గురవరాజుపేట, కనకా

తెలుగులో మరింకే
రచయితకన్న సమాజాన్ని
ఎక్స్‌రే తీసినంత స్పష్టంగా
సూటిగా, ఇతివృత్త
వైవిధ్యంతో చూపగల
రావి శ్రీమన్నారాయణ
సరికొత్త నవలలు
ప్రతి నవలకు మరింకెవ్వరూ
ఇవ్వలేని 6 రంగుల ముఖచిత్రం
ఒక్కో నవల వెల రు.5/-

హనీమూన్
మహామేధావి
నిప్పులాంటిమనిషి
ఎందరో భక్తులు!
లేడీ టైపిస్ట్

పాఠకులకు
ప్రత్యేక తగ్గింపు ధర!
వి.పి పోస్టేజీతో సహా ఏ
నవలయినా రు.4/-. కోరు
కున్న ఏ 3 నవలలయినా
రు.10/-లు మాత్రమే!
నేడే వ్రాయండి!

ప్రత్యూష పబ్లికేషన్స్
* విజయవాడ-4.

పురం కోటిపాడు, పాలకూరు, వరదయ్యపాళెం ...అంటూ పాపయ్యా ఊళ్ళ పేర్లు ఒక దండకంలా ఒప్పగించేవాడు.

ఉద్యోగ జీవితంలో మొదటిసారిగా నేనొక ఏకోపాధ్యాయ పాఠశాలను సందర్శించాను. ఆ బడికి గోడలు లేవు. పూర్వాశ్రమంలో అది బహుశా పశువుల కొట్టమై వుండవచ్చు. అయ్యగారొక మూడు కాళ్ళ కుర్చీపైన కూర్చున్నాడు. పిల్లలందరూ మట్టినేలపైన జోగుతున్నారు. చుట్టాచుట్టి పైకప్పులో చెక్కిపెట్టిన అటెండన్సు రిజిష్టరును తీసి నా చేతిలో పెట్టాడు టీచరు. ఐదో తరగతిలో ముగ్గురు కుర్రాళ్ళున్నారు. అందులో ఒకడు నెలలతరబడి బడికిరావడంలేదు. రెండోవాడు నాలుగు రోజుల నుంచీ గైరుహాజరు. మిగిలినవాడొక్కడే. వాడిని నేను దగ్గరికి పిలిచి, తెలుగు వాచకంలో నాలుగో పాఠం చదవమన్నాను. "వాచకం లేదండీ" అన్నాడు కుర్రాడు. "మరేముంది?" అన్నాను. "గవరయ్యగైడు వుందండీ" అన్నాడు విద్యార్థి

గవరయ్య గైడు! ఆ పేరే నాకు కొత్త.

"ఏదీ ఆ గైడువిలా తీసుకరా చూద్దాం...." అన్నాను.

కుర్రాడు తీసుకొచ్చాడు. సైజులో అది ఎక్కాల పుస్తకం పాటిది. వంద పుటలకు మించదు. సర్వరోగనివారిణిలా తెలుగు, సాంఘికశాస్త్రం, సామాన్య శాస్త్రం, గణితం మొదలైన పాఠ్యాంశాలన్నీ అందులోనే వున్నాయి. ఉన్నాయంటే పూర్తిగా వున్నాయనిగాదు. ఉన్నవన్నీ ప్రశ్నోత్తరాలు. ఈ ప్రశ్నోత్తరాల తీరు గూడా బహు చిత్రంగా వుంది. ఉదాహరణకు వేదములెన్ని అంటూ ఒక ప్రశ్న వుందనుకుందాం. దానికొక సాంకేతిక సమాధానం, కుండలీకరణాల నడుమ RYSA అని వ్రాయబడింది. ఈ RYSA కు విశదీకరణం తరువాతి అంశం. R అనగా ఋగ్వేదం. Y అనగా యజుర్వేదం. S అంటే సామవేదం. A అంటే అధర్వణ వేదం!

అలాగే చరిత్రలో ప్రసిద్ధులయిన మొగలాయీ చక్రవర్తులెవరు? అంటూ మరొక ప్రశ్న వుంది. దీనికి సంక్షిప్త సమాధానం 'బహు అజిషాబొ' ఒక్కొక్క అక్షరానికి ఏకొక్క పేరుగా తరువాత వివరణ.

ఈ గవరయ్య ఎవడో గానీ ఇతడు న్యూటన్‌లా అయిన్‌స్టీనులా గొప్ప మేధావుల పరంపరలోని వాడని నాకు విశదమైంది. చిన్న చిన్న పొడిపాదాలతో, పద్యపాదాలతో, పొడుపు కథలతో చిన్న గుళికలతో పెద్ద రోగాలను నివారించినట్టుగా అతడొక గైడును సృషించిపారేశాడు.

విద్యార్థిపైన ఈ గుళికల ప్రభావం ఏ మాత్రమో తెలుసుకోవాలి గదా! "చూడబ్బాయ్! మన భారత దేశానికి ఎల్లలేవో చెప్పగలవా?" అన్నాను.

అదెంతపని అన్నట్టుగా ఆ కుర్రవాడు గిరుక్కున వెనుదిరిగి తూర్పు దిక్కుకు అభిముఖంగా నిల్చున్నాడు. దొంగల గుహలో కవాటం తెరుచుకోడానికి ఆలీబాబా చెప్పిన మంత్రంలా "బంహిం ఆహి" అన్నాడు. ఆపైన బం—బంగాళాఖాతము, హిం—హిందూ మహాసముద్రము అంటూ నాకు మంత్రార్థాన్ని వ్యాఖ్యానించాడు.

నాకు మతి పోయినంతపనైంది.

"అయ్యా పంతులుగారూ! ఈ గైడ్ల నిర్మాణప్రక్రియ అమోఘంగా వుంది. ఈ మహానుభావుడు గవరయ్య భూమిపైన మానవజన్మ ఎత్తినందుకు ఒక ఘనకార్యం చేసి జీవితం సార్థకం చేసుకున్నాడు. ఈలెక్కన గవరయ్య గైడ్లు ఉపయోగిస్తున్నది ఈ ఒక్క పాఠశాలేనా!? ఇలాంటివి మరికొన్ని గూడా వున్నాయా? సెలవిస్తే తెలుసుకోవాలని వుంది" అన్నాను.

ఆ టీచరుముఖం విప్పారింది. 'మా సమితిలోని స్కూల్స్‌లో ఎక్కువగా వినియోగ మౌతున్నది గవరయ్య గైడే నండీ!' అన్నాడు.

'దీనివల్ల చాలా లాభాలున్నాయి గదండీ మేష్టరుగారూ! ముఖ్యమైనది మీరు పాఠాలు చెప్పవలసిన శ్రమ వుండదు. పిల్లలుగూడా అదొకపనిగా పాఠ్య పుస్తకాలు చదవవలసిన అగత్యం లేదు. రోజుకొక గుటికవేసి పేచాలు, ఈ గైడ్‌వల్ల సమస్త విద్యలూ కరతలామలక మైపోతున్నాయి....' అన్నాను.

'మెల్లగా చెబుతున్నారా సార్ ఆ మాట! ఈ గైడ్లు అంత ప్రయోజన కరంగా వుండబట్టే, యిప్పటికిది పద కొండో ముద్రణ, ఇందుకోసమని గవ రయ్యగారు ప్రత్యేకంగా ఒక ప్రెస్‌ను గూడా నడుపుతున్నారు. మొన్న నే రెండంతస్తులకట్టడం పూర్తిచేసి గృహ ప్రవేశంచేశారు. ప్రతి స్కూలుకీ ఇన్విటేషను పంపించారులెండి! టీచర్లకందరికీ గ్రాండ్‌గా డిన్నర్ యిచ్చారు....'


'అలాగా! ఆ గవరయ్యగారిని నేను గూడా ఒకసారి దర్శించుకోవాలి. విద్యా వ్యవస్థకు ఆయనచేస్తున్న మహోపకారానికి కృతజ్ఞత చెప్పుకోవాలి. గరవయ్యగారెక్కడుంటారు?' అని ప్రశ్నించాను.

ఇక్కడ పాపయ్య కలగజేసుకున్నాడు. 'భజనమందిరం ప్రక్కన పసుపు మిద్దెలేదటండీ! అదే గవరయ్యగారిల్లు....' అన్నాడు.

'ఓహో, ఆ పుస్తకాల దుకాణమున్న యిల్లా?' అన్నాను.

పాపయ్య సవరించాడు — 'అది పుస్తకాల దుకాణం గాదండీ! గైడ్ల గోడౌను....'

తన ప్రణాళికల్లోలాగే ఆకారంలో గూడా ధిట్టమైన మనిషి గవరయ్యగారు. ఏబదేళ్ళ వయస్సు. పొడుగూ, పొట్టీ, లావు, సన్నమూ అని వంకలు పెట్ట



చిత్రకారుడు: టి. యస్. చలం — [illegible]

డానికి వీల్లేని శరీరం, బిరుసెక్కి నొసదేలిన మీసాలు ఆయనలోని పట్టుదలకు చిహ్నంగావున్నాయి. కొట్టులో ప్రవేశించి నన్ను నేనే పరిచయం చేసుకోదలుస్తుండగా ఆయనే పలకరించాడు.

'నమస్కారమండీ! రండి కూచోండి, నన్ను మీ రెరుగరేమోగానీ మీరు నాకు బాగాగురే. ఈ వీధిగుండా వెళుతుంటే ఎన్నోసార్లు చూచాను. పలకరించే వుద్దేశం లేకపోలేదు. కానీ మీరు అధికారులు గదా! నేనొక పుస్తకాల వ్యాపారిని. నా అంతట నేనే మీతో పరిచయం కలిగించుకోజూస్తే, మీరు వేరొక విధంగా భావించవచ్చు....'

'అబ్బే ఎంతమాటెంతమాట! నేనలా వేరొకవిధంగా భావించేవాణ్ని కానండీ గవరయ్యగారూ! ఈ వీధిగుండా వెళూ నేను గూడా మీ కొట్టువైపు చూడక పోలేదు. కానీ మాట్లాడవలసిన అవసరం వుంటుందని నిన్నటిదాకా అనుకోలేదు.'

"సెలవివ్వండి సార్! నేను పరాయివాడినని మీరనుకో నక్కరలేదు. స్వంత మనిషి ననుకోండి. ఏమాత్రం పనిబడినా నాకు కబురుపెట్టండి. నిమిషాల్లో నెర వేర్చేస్తూచీవాడి. మీరు మొహమాటం పెట్టుకోవలసిన పనేలేదు. ఇప్పుడైతే యిలా కొట్టుపెట్టుకున్నానుగానీ, ఒకప్పుడు నేనూ టీచరునే! ....

"అలాగటండీ గవరయ్యగారూ! మీరు టీచరుగా పనిచేశారా? చేసేవుంటారు. కానీ నేనిప్పుడు మాట్లాడదలచుకున్నది గతచిపోయిన విషయాలను గురించిగాదు. మీరిప్పుడు చేస్తున్న పనిని గురించి...."

సరే గతాన్ని బాగా పసిగట్ట గలిగిన వారే గరవయ్యగారు! నా మాటల ధోరణినిబట్టి యిందులో వడ్లగింజలో బియ్యపుగింజలాంటిదేదో వుందనుకున్నాడు. వెంటనే వినడానికి తాను సావధానంగా వున్నట్టుగా ముఖభంగిమను సర్దుబాటు చేసుకున్నాడు.

"విద్య నిగూఢగుప్తమగు విత్తము; రూపము పూరుషాళికిన్–అని ఓ కవి చెప్పాడని మీకు నేను చెప్పను. విద్య లేనివాడు వింత పశువని మరొకాయన అన్నారనిగూడా చెప్పను. విద్యవిలువ మీకూ నాకూగూడా నికరంగా తెలిసిన విషయమే. ఈనాటిపిల్లలే రేపటి పౌరు

అని మీరు పెద్దల ఉపన్యాసాల్లో వినే వుంటారు. ఆ పిల్లలు బుద్ధిమంతులు కావడంపైనే దేశ ప్రగతి ఆధారపడి వుంది. చదువుకుంటే సదసద్వివేకం కలుగుతుందనీ, విజ్ఞానం లభిస్తుందనీ మనం మనపిల్లల్ని బడికిపంపుతున్నాం. కానీ వాళ్ళుబుద్ధిగా చదువుకోడానికి వీల్లేని పరిస్థితులు కల్పిస్తూ కొన్ని దుష్ట శక్తులు విపరీతంగా చెలరేగుతూ వుండడం మన దురదృష్టం. చల్లకొచ్చి ముంత దాచుకోవడమెందుకండీ గవరయ్యగారూ! ఆ దుష్టశక్తుల్లో మీరొక్కరుగావటం మరీ విచారకరం...."

గరవయ్యగారు తెల్లబోయి వుంటారని నా అనుమానం. ఐనా అంతలోనే తేరుకున్నాడు. తటాలున చేతులు జోడించి "నేనెందరినో ఇన్స్పెక్టర్లని చూచానుసార్! ఇంత నిష్కపటంగా మాట్లాడిన వారొక్కరూలేరు. ధాపరికంలేదు మీకు తోచినవిషయాన్ని ఘిరు కుండ బద్దలుకొట్టినట్టుగా చెప్పినందుకు హృదయపూర్వకంగా నమస్కరిస్తున్నాను...." అన్నాడు.

ఈదఫా తెల్లబోవలసినవంతు నాకే వచ్చింది.

"మంచిది సార్! మీరు న్యాయమూర్తిలా నిలదీసి అడుగుతున్నారు. నేను ముద్దాయిలా ఎదుట నిల్చున్నాను. మీరు మోపుతున్న నేరమేదైతేవుందో దాన్ని నేను చెయ్యలేదని చెప్పుకోబోవడం గూడాలెదు. ఈ నేరస్థుడికి మీరేశిక్ష విధించినా భరించడానికి సిద్ధమే! కానీ యిక్కడ నా మనవి ఒకటుంది. ఈ నేరం నేనెందుకు చేయవలసివచ్చిందో చెప్పుకోనివ్వడం మీ ధర్మం."

నింపాదిగా సిగరెట్టు ముట్టించుకుంటూ "చెప్పండి" అన్నాను.

చెప్పడానికి బదులుగా గరవయ్యగారు నాపైకి ఒకప్రశ్ననే సంధించాడు. "మీ పుట్టిన తారీఖేమిటి సార్?"

ఎందుకూ అనబోయి, ఎందుకైతే నేమనుకుని సమాధానం చెప్పాను — "ఆగష్టు నలభై రెండు."

"నేను సర్వీసులోచేరింది నలభైలో. అప్పటికిలా ఉద్యోగాలకు కరువేర్పడలేదు. ఉద్యోగులకే కరువుండేదన్నా తప్పుగాదు. డిస్ట్రిక్టుబోర్డు ఎడ్యుకేషనల్ ఆఫీసరుగారు నాకు స్వగ్రామంలోనే పోస్టింగుయిచ్చారు. బాగా పనిచేసి మంచిపేరు తెచ్చుకోమని సలహా యిచ్చారు. నాకుగూడా బాగా పనిచేసి పదిమంది దగ్గరా మెప్పుపొందాలని వుండేది. ఉద్యోగంలో చేరినకొత్తలో ఇంచుమించుగా నాకు బడేఇల్లైపోయింది. భోజనంకోసం యింటికి వెళ్ళడమే వెళ్ళడం. మిగిలినప్పుడు బడిలోనే వుండిపోయేవాణ్ని. బడి గోడలకు స్వయంగా నేను వెల్లవేయవలసిన పనిలేదు. బడితోటలో మొక్కలకు నేను నీళ్ళు చేది పోయవలసిన


మీ బిడ్డల కిప్పుడే దాచుట నేర్పండి

స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్‌లో
అతని కొక కాతా నేడే ప్రారంభించండి

★ మైనరు బిడ్డల తరపున వారి తలిదండ్రులుగాని, కోర్టు నియమించిన గార్డియన్‌గాని సేవింగ్ అకౌంట్లను ప్రారంభించి నిర్వహింపవచ్చును.

★ పద్నాలుగేండ్లు పై బడ్డ బిడ్డ తన సేవింగ్స్ అకౌంటును తానే నిర్వహించుకోవచ్చును.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్

SBH: 69-4

అగత్యంలేదు. యువకుల్ని సమీకరించి శ్రమదానంతో ప్రహరీగోడ పెట్టించాలన్న నిర్బంధంలేదు. కరణం మునసబుల ప్రాపకంతో బడికోసం ఒక ఆటస్థలాన్ని సంపాదించవలసిన అవసరం లేదు. చీకటిపడ్డ తర్వాత యింటిదగ్గర దీపాలు పెట్టుకుని చదువుకునే సదుపాయాలులేని పిల్లల కందరికీ రాత్రివేళ కూడా బడిలోనే చదువుకునే ఏర్పాట్లు చేయవలసిన పూచీలేదు. కానీ ఈ పనులన్నీ నేను చేశాను. ఆ రోజులు వేరు ! అంతగా శ్రమపడినందుకు నాకు ఆశాభంగం కలగలేదని నేను సంతృప్తితో చెప్పుకోగలను. జిల్లా బోర్డువారు ప్రతి సంవత్సరము ఒక మోడల్ స్కూలును ఎన్నికచేసి దానికొక షీల్డుయిస్తుండేమో ఈ వూరి పాఠశాల కలాంటి షీల్డు వరుసగా మూడు సంవత్సరాలు లభించింది. మీరెప్పుడైనా ఆ బడిని తనిఖీచేస్తే వాటిని ఈ నాటికీ చూడవచ్చు ...."

"హెడ్మిస్ట్రెస్ ఒకసారి ఆ మాట చెప్పినట్టు జ్ఞాపకం. ఈసారి వెళ్ళినప్పుడు చూస్తాను...."

"అంతలోనే దేశానికి స్వరాజ్యం వచ్చింది. అన్నిరంగాల్లోనూ మార్పులు కుప్పతిప్పలుగా వచ్చిపడసాగాయి. ఎన్నో అవాంఛనీయ పరిణామాలు పొడసూపాయి. ఆ గొడవలన్నీ మీకు నేను చెప్పను. మధ్యంతరంగా నాచేత ఉద్యోగానికి రాజీనామా యిప్పించిన పరిస్థితిని మాత్రం మనవి చేస్తాను ...."

"చెయ్యండి" అన్నాను.

"ఈ వూళ్ళో ఒక ఆసామివున్నారు పుట్టింది మొదలు ఈనాటివరకు అతడి పేరొకటే! నావ్హోదాలు మాత్రం మారుతూవచ్చాయి. ఈ బాబూరావు పదిహేనేళ్ళకు పూర్వం ఒక చెక్కల కొట్టు పెట్టుకుని బీడీ సిగరెట్లు అమ్ముకుంటూవుండేవారు. కొట్టుకు వెనక పూరికొట్టంలో నాటుసారా వ్యాపారం పుష్కలంగా జరుగుతుండేదన్న విషయం మన కప్రస్తుతం. బాబూరావుకొక్కతే కూతురు. మగపిల్లలు లేకపోలేదు. కానీ వాళ్ళు అయ్యవార్లకు పంగనామాలుపెట్టి వీధుల్లో రాజ్యమేలుతున్నారు కూతురుమాత్రం క్రమంగా బడికొస్తుండేది. బడికొస్తూ వస్తూ ఆపిల్ల ఓ డబ్బా నిండుకూ వేరుశనగగింజలు. బఠాణీలు పిప్పరమెంట్లు, చాక్లెట్లు తీసుకొచ్చేది. ఆడబ్బా ఖాళీగావడానికీ బడిలో ఆఖరుగంట కొట్టడానికి సరిపోయేది. ఈ రివాజుప్రకారం రోజుకు రెండుసార్లు తినుబండాలడబ్బా ఖాళీ అవుతూ వచ్చిందేగానీ అక్షరంముక్క ఆవిడ బుర్రలో కెక్కలేదు. నా దగ్గర తన పప్పులు ఉడకవని బాబూరావుకు బాగా తెలుసు. మిగిలిన అయ్యవార్ల దగ్గరికి వచ్చిపోతూ అడపాతడపా చేబదుళ్ళిచ్చి ఆడుకుంటూ అతడు అక్షరక్రమమైన


— మిత్రులకు, అభిమానులకు, ఖాతాదారులకు, శ్రేయోభిలాషులకు —

★ సంక్రాంతి శుభాకాంక్షలు ★



గ్రామ్స్ : 'డైమండ్'

ఫోన్స్ : ఆఫీసు–6093 & 6602
హౌస్–7282 & 7714

*Bayyana Bhimaiah & Co.,*

**DEALERS IN ALL JUTE PRODUCTS**

**VIJAYAWADA-1**

**బయ్యన భీమయ్య అండ్ కో**

**అన్నిరకముల జనుపనార వస్తువుల వ్యాపారస్తులు**

**విజయవాడ - 1**

సరిగ్గా తెలియని తనకుమారైను అయిదవ తరగతి దాకా నెట్టుకరాగలిగాడు. ఈ చివరిగేటు దగ్గర నేను బాబూరావుకు భేతాళుడివిలా కనిపించాను. ఒక మనిషి యింకొక మనిషిని ఎన్నెన్ని రకాలుగా మాలీసు చేయడానికి వీలుందో అన్ని విధానాలూ ప్రయోగించిచూచారు. నేను దేనికీ లొంగిరాలేదు. పదేళ్ళు చదివినా సరే, ఆపిల్ల అయిదో తరగతి పరీక్షలో పాసుమార్కులు తెచ్చుకోదని నిక్కచ్చిగా చెప్పేశాను. బాబూరావు ప్రతిమాలుకున్నాడు.

"బాబ్బాబూ! మీకు పుణ్యముంటుంది ఏదో పాసయిపోయిందనిపించండి. అయిదో తరగతిలోకూడా కడతేరకపోతే ఈ మొద్దుముండకు పెళ్ళిసంబంధాలయినారావు" అని వాపోయాడు. నేను ఆలోచించి చూచాను. ఆపిల్లను పాస్ చేయడం వల్ల లోకానికి కలిగే అపకారమేమీ వుండదనిపించింది. పోనిమ్మని జస్ట్ పాసుమార్కులు వేసి గట్టెక్కించేశాను...."

క్షణాలపాటు గవరయ్యగారు మౌనం వహించారు.

"కొంపదీసి ఆపిల్ల చక్కా వెళ్ళి హైస్కూల్లో చేరలేదుగదా!" అంటూ నేను సందేహం ప్రకటించాను.

"జరిగిందదే! బిల్డింగు ఫీజు చెల్లిస్తే గాడిదపిల్లనైనా బడిలోకూచోబెట్టుకోడానికి సమ్మతిస్తారు హైస్కూలు కమిటీవాళ్ళు. బాబూరావు దగ్గర డబ్బుంది. టంచనుగా ఓ వంద రూపాల నోటు పారేసి మున్ముందుగా తనకూతుర్నే హైస్కూల్లో అడ్మిట్ చేయించాడు. ఏమిటిలా చేశావని అడిగితే పో పోవయ్యా!

అంతా నువ్వనుకున్నట్టే జరగాలా ఏమిటి' అంటూ ఈసడించి పారవేసేటట్టున్నారు. మౌనమే నాకు భూషణమైంది. ఆ అమ్మాయి కెలాగూ పరీక్షల్లో సింగిల్ డిజిట్‌లో తప్పా రెండంకెల్లో మార్కులురావు. ఒకటిరెండేళ్లలో ఈ హైస్కూలు ముచ్చటగూడా తీర్చుకుని ఆ అమ్మాయి లక్షణంగా యింట్లో కూర్చుంటుందనే నేనూహించాను. ఇక్కడగూడా నా అంచనా తప్పిపోయింది. పాస్ రావడానికి చదువుకోడమొక్కటే మార్గం కాదని ఆ తండ్రీ కూతుళ్లు యిద్దరూ కలిసి సమిష్టి కార్యాచరణద్వారా నిరూపించారు. ట్యూషన్లు చెప్పేవాళ్ళ కందరికీ (ట్యూషన్లకుఅమ్మాయిని పంపకపోయినా సరే) పదో, పాతికో సహాయం చెయ్యడమూ, పరీక్షలకుముందు కొశ్చన్ పేపర్లిచ్చేవాళ్ల చిరునామా తెలుసుకోడమూ, పరీక్షల

> **ఉద్రేకానికి తార్కాణం**
>
> ఉద్రేకానికి తార్కాణం ఏదైనా చెప్పమని టీచరు పిల్లల్నడిగింది. పదేళ్ళపిల్ల ఇలారాసింది
>
> "పంతులమ్మ – నా కొత్త సైకిలుమీద కొండఅంచున తొక్కుతూ వున్నప్పుడు చూస్తే ఉద్రేకం కలుగుతుంది."
>
> — ఈవెనింగ్ న్యూస్.

సమయంలో సూపర్వయిజరును కాస్త కనిపెట్టి వుండమని చెప్పడము పరీక్షలైన తర్వాత ఆన్సర్ పేపర్లు ఎక్కడికి వెళ్ళిందీ పసికట్టడము, యిలాంటి బాహ్యసాధనలద్వారా బాబూరావు తీవ్రంగా కృషిచేస్తూ వచ్చాడు. ఆ అమ్మాయిగూడా తన కృషిలో తాను ఆరితేరిపోతూ వచ్చింది. చిన్నచిన్న బిట్ పేపర్లలో పెద్దపెద్ద ఆన్సర్లను రాగిగింజలకంటే చిన్నసైజులో వ్రాసి పెట్టుకోడంలో ఆమె అనన్యసామాన్యమైన నేర్పు గడించింది. ఆబిట్ కాగితాలను ఆమె ఎక్కడెక్కడ దాచిపెట్టుకోగలిగిందో, ఎలా పైకి తీస్తుందో, ఎంత చాకచక్యంగా కాపీ కొట్టగలదో.... యివన్నీ సూపర్వయిజర్లు చెప్పుకునే సాహస గాథలుగా పరిణమించాయి. ఈ నేర్పరితనంతో ఆమె స్కూలు ఫైనల్లో ఫిఫ్టి పర్సెంటుకు పైగా మార్కులు తెచ్చుకోగలిగింది. అంతటితోనైనా ఈ ఘోరకలి శాంతించి వుంటే బాగుండేది. పులిమీద పుట్రగా ఆవిడ టీచర్సు ట్రైనింగులోచేరి చూస్తూ చూస్తూ వుండగానే అమోఘమైన తన పరీక్షాసాగర తరణోపాయాలను మరొకసారి ఋజువుచేస్తూ ఆ పరీక్షలోగూడా ఘనవిజయం సాధించింది. అప్పటికి


గ్రామ్స్ : TEXMOTOR ఫోన్ : 3347



టెక్స్మో మోటార్లు & పంపులు

ఒక సంవత్సరం గ్యారంటీ

టెక్స్మో యిండస్ట్రీస్

హెడ్డాఫీసు : కోయంబత్తూరు ★ పార్కురోడ్డు, – విజయవాడ-1

బాబూరావు రాజకీయాల్లో ప్రవేశించి గొప్పవాళ్ళకు కొందరికి ప్రక్కబలంగా రూపొందాడు. వాళ్ళ ప్రాపకంలో అతడు అశ్రమంగానే కుమారైకు ఉద్యోగం సంపాదించ గలిగాడు. ఏబడిలోనైతే తాను చదువుకున్నదో. ఆబడిలోనే ఆమెను హెడ్‌మిస్ట్రెస్ గావేయడం జరిగింది. ఆవిడ హెడ్ మిస్ట్రెస్‌గా పాఠశాలలో ప్రవేసించేసరికి నా రాజీనామా ఉత్తరం ఆఫీసుకు చేరింది...." కొట్టులో పనిచేస్తున్న కుర్రవాడిచేత గవరయ్యగారు కాఫీ తెప్పించారు.

"కాఫీ తీసుకోండిసార్! ఒక వ్యవస్థను బాగుచేయడమనేది మనలాంటి సామాన్యులవల్ల చేతనయ్యేదంటారా? కర్ణుడిచావుకు కారణాలు పెక్కులు! ఒక విమానం కూలి పడిపోతే, ఒక రైలు కూలిపోతే, వరదలువచ్చి కొన్ని వూళ్ళు కొట్టుకపోతే- ఆ ప్రమాదంలో నుంచీ లాభంపొందే కుబుద్ధి లోకంలో లేదనగలరా! అలాంటి పెడబుద్ధిలోనే నేనీ గెడ్డవ్యాపారం మొదలెట్టాను. దేనినైతే మనం బాగుచేయడానికి ప్రయత్నించి విఫలుల మౌతామో, దానిలో నుంచీ లాభం పొందడానికి ఆస్కారం వున్నప్పుడు, దాన్నెందుకు వదలుకోవాలో నాకు తోచిందిగాదు. గవరయ్య పంతులుగారన్న పేరుమాసిపోయింది. గెడ్డవ్యాపారం గవరయ్యనిగా మిగిలాను జి. వి. గవరయ్యనన్నమాట! ఎవరు చెప్పగలరు? అదృష్టం బాగుండే నేను గౌరవనీయ గవరయ్య ని గూడా గావచ్చు...."

నేను ఔననలేదు. కాదనలేదు. తల వంచుకుని కొట్టునుంచీ మెల్లగా ఈవలకి వచ్చేశాను. ★



# నగ్నగీతి ★ ★

నాకు తెలుసు—
నా సంతోషాన్నెవరూ పంచుకోలేరు!
నా దుఃఖాన్ని పంచుకోలేనివా రెవరూ—
నా సంతోషాన్ని పంచుకోలేరు!!

నాలోపూచిన వసంతాన్ని
నాలో ధ్వనించే కోకిలగానాన్ని
నాలో స్పందించే మధురానుభూతిని
ఎవరు పంచుకోగలరు?

మననుండించిన గ్రీష్మాన్ని
నను వణికించిన హేమంతాన్ని
నను ఒలిచేసిన శిశిరాన్ని
ఎవరు పంచుకొన్నారో?

నాకు తెలుసు....
నన్నెవ్వరూ పంచుకోలేదు!
అందుకే, నేడు—
నన్నుచూచి యెవరూ యీర్ష్యపడనక్కర్లేదు!
నే ననుభవిస్తున్న వెన్నెలరాత్రి కరగిపోతుందని,
రేపు చీకటి మూసుకొస్తుందనీ,
ఎవరూ నన్ను హెచ్చరించనక్కర్లేదు!
నేను తెలిసికొన్నాను—

అమృతమూ హాలాహలమూ ఒకే కడలిలో జనించాయని
మంచీ, చెడూ, రెండూ రెండు విభిన్నకృతులు కల్గివుంటాయని!
సుఖమూ, దుఃఖమూ జీవితంలో జీవి అధిగమించాల్సిన
మైలురాళ్ళని!!

నేను తెలిసికొన్నాను—
వెలుగుపక్క చీకటి
చీకటిప్రక్కనే వెలుగు జీవిస్తుందని!
ఆకురాలినకొమ్మ చిగిర్చి తీర్తుందని!!

—యం. కె. సుగమ్‌బాబు.